

# ఘనంగా ఏనుగు సుదర్శన్ రెడ్డి జన్మదిన వేడుకలు

**శుభాకాంక్షలు తెలిపిన కౌకుట్ల రాహుల్ రెడ్డి**

**నాగారం, జూన్ 6 (జనంవార్త) :** బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు,మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి జన్మదిన వేడుకలను తన అభిమానులు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ జన్మదిన వేడుకలకు నాగారం డివిజన్ బిజెపి యువ నాయకులు కౌకుంట్ల రాహుల్ రెడ్డి హాజరై ఏనుగు సుదర్శన్ రెడ్డికి శాలువాను కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం కేకును కటింగ్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా నోట్ బుక్స్,పెన్నులను అందజేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాకేష్ యాదవ్,ఉపేందర్,ఎర్ర వామన్,అస్లామ్ తదితరులు పాల్గొన్నారు.



# ఏనుగు సుదర్శన్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన మాజీ చైర్మన్

**నాగారం,జూన్ 6 (జనంవార్త) :** బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు,మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి జన్మదిన వేడుకలు తన నివాసంలో శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ జన్మదిన వేడుకలకు నాగారం మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి తన అనుచరులతో కలిసి హాజరైనారు. ఈ సందర్భంగా ఏనుగు సుదర్శన్ రెడ్డికి శాలువాను కప్పి ఘనంగా సత్కరించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్ గౌడ్,నక్క కిషోర్ గౌడ్, రవీందర్ రెడ్డి, జంగారెడ్డి,జూపల్లి నరేష్,కృష్ణ,సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బూత్ కమిటీ సమావేశాన్ని విజయవంతం చేయండి

**మాజీ వార్డు సభ్యులు సాయినాథ్ గౌడ్**



**నాగారం, జూన్ 6 (జనం వార్త) :** నేడు నాగారం డివిజన్ పరిధిలో నిర్వహించే బీఆర్ఎస్ పార్టీ బూత్ కమిటీ సమావేశాన్ని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులను మాజీ వార్డు సభ్యులు చిన్నంరాజు సాయినాథ్ గౌడ్ కోరారు. నాగారం డివిజన్ పరిధిలోని ల్యాండ్ మార్క్ కన్వెన్షన్ హాల్లో నేడు జరగబోయే పార్టీ బూత్ కమిటీ సమావేశాన్నికి స్థానిక ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, మల్కాజిగిరి, మేడ్చల్ ఇంచార్జ్ లు రాగిడి లక్ష్మారెడ్డి, చామకూర మహేందర్ రెడ్డిలు హాజరుకానున్నారు. ఈ కార్యక్రమాన్ని మాజీ కౌన్సిలర్లు,మాజీ వార్డు సభ్యులు,మాజీ కో-ఆప్షన్ సభ్యులు, సీనియర్ నాయకులు, ఉద్యమకారులు, కార్యకర్తలు, పార్టీ కుటుంబ సభ్యులు అందరూ పెద్దఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మనవి చేశారు.



# రైతాంగంపై కేంద్రం నిర్లక్ష్యం వీడాలి

**సబ్సిడీపై విత్తనాలు అందించాలి: ఏఐయూకేఎస్**

**కారేపల్లి :** రైతాంగ సమస్యలను పరిష్కరించి, పెంచిన ఎరువుల ధరలను వెంటనే తగ్గించాలని అఖిలభారత ఐక్య రైతు సంఘం (ఏఐయూకేఎస్) డిమాండ్ చేసింది. సంఘం ఆల్ ఇండియా కమిటీ పిలుపు మేరకు శుక్రవారం సింగరేణి మండల డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏఐయూకేఎస్ ఖమ్మం డివిజన్ కార్యదర్శి గుగులోతు తేజ నాయక్ మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది సాధారణ వర్షపాతం కంటే తక్కువ వర్షాలు కురిసే అవకాశం ఉందని, రైతులకు అవసరమైన అన్ని రకాల విత్తనాలను పూర్తి సబ్సిడీపై అందించాలని కోరారు. రాష్ట్రంలో వరి, జొన్న, మొక్కజొన్న, చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు తదితర పంటల విత్తనాలు అవసరమైన మేరకు అందడం లేదని పేర్కొన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో 90 శాతం సబ్సిడీపై విత్తనాలు అందించాలనే నిబంధనలను అమలు చేసి, కారేపల్లి, కామేపల్లి మండలాల రైతులకు కూడా పూర్తిస్థాయిలో సబ్సిడీ ప్రయోజనాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పుల్లకాని సత్తిరెడ్డి, వడ్డే వెంకటేశ్వర్లు, బాలు నాయక్, రావుల నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానిక ప్రత్యేక కృషి చేస్తా : బండి రమేష్

**బాలాజీనగర్‌లో బండి రమేష్ పాదయాత్ర**



**కూకట్ పల్లి, జూన్ 6 (జనం వార్త) :** స్థానికంగా నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో భాగంగా బాలాజీ నగర్ లో రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్, కూకట్ పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ శనివారం పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. దీంతో స్థానికులు కాలనీ లోని పలు సమస్యలను బండి రమేష్ కు ఏకరువు పెట్టారు. ప్రధానంగా కాలనీలో రోడ్ల పరిస్థితి ఆధ్వనంగా ఉన్నాయని ఇబ్బందులు పడుతున్నామని, డ్రైనేజ్ సమస్య తీవ్రంగా ఉందని స్థానికులు వాపోయారు. కాలనీలోని అపోలో ఫార్మసీ ఎదురుగా ఉన్న రోడ్డు 60 అడుగులకు విస్తరించడం, మధ్యలో డివైడర్ ఏర్పాటుచేసే ప్రతిపాదన పై స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం బండి రమేష్ మాట్లాడుతూ సమస్యలపై సంబంధిత అధికారులతో చర్చించి కాలనీవాసులందరికీ అనుకూలమైన నిర్ణయం



తీసుకుంటామని హామీ ఇచ్చారు. కాలనీలోని డ్రైనేజ్ వ్యవస్థను పునరుద్ధరించేందుకు చర్యలు చేపడతామని, రోడ్ల అభివృద్ధికి అవసరమైన పనులను త్వరగా ప్రారంభించేలా కృషి చేస్తామని తెలిపారు. తన దృష్టికి వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరించే దిశగా కృషి చేస్తానని స్థానిక ప్రజలకు హామీ ఇచ్చారు. నేను మళ్ళీ బాలాజీ నగర్ కు పాదయాత్రకి వచ్చే సమయానికి ఒక్క సమస్య కూడా మిగలకుండా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. గత పది సంవత్సరకాలంలో పరిపాలించిన నాయకులు అభివృద్ధి చేశామని గొప్పలు చెప్పుకుంటున్నారని, కానీ నియోజకవర్గంలో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి కాంగ్రెస్ నాయకులు శేరి సతీష్ రెడ్డి, కొప్పిశెట్టి దినేష్, గాలి బాలాజీ, గంధం రాజు, కృష్ణా రాజ్ పూత్,శివ చౌదరి,రంగమోహన్, తూము సంతోష్, మన్నె రవి, నళిని కాంత్, స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కెపిహెచ్‌బిలో ఫుట్‌పాత్ ఆక్రమణల కూల్చివేత

**కూకట్‌పల్లి, జూన్ 6, (జనం వార్త) :** కేపిహెచ్ బి కాలనీ మీ సేవ రోడ్డు లో రోడ్డును ఆక్రమించి ఏర్పాటు చేసిన వీధి వ్యాపారుల దుకాణాలను సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు శనివారం ఉదయం కూల్చి వేశారు. గత కొంతకాలంగా వీధి వ్యాపారుల వల్ల సాయంత్రం సమయంలో ట్రాఫిక్ జామ్ తో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు కాలనీవాసులు, స్థానికులు పలుమార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి నట్లు తెలుస్తోంది. స్పందించిన అధికారులు ట్రాఫిక్ సమస్యను పరిష్కరిం





చడంలో భాగంగా కూల్చివేతలు చేపట్టినట్లు తెలిపారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారంలో భాగంగా చిరు వ్యాపారుల స్టాల్స్ తొలగించాలని యజమానులకు గతంలోనే సిఎంసి అధికారులు నోటీసులు అందజేసినట్లు అధికారులు తెలిపారు.. నోటీసులు ఇచ్చినప్పటికీ చిరు వ్యాపారులు స్పందించకపోవడంతో పోచమ్మ ఆలయం నుండి హౌసింగ్ బోర్డు మూడవ ఫేస్ బస్టాండ్ కు వస్తున్న దారిలో ఇరువైపుల ఏర్పాటుచేసిన వీధి వ్యాపారుల స్టాల్స్ ను జెసిబి సహాయం తో పోలీసుల బందోబస్తుల మధ్య సీఎంసి అధికారులు తొలగించారు.

# రక్తదానం జీవన వరం

- కార్మిక సంక్షేమం సమాజానికి బలం
- ఏనుగు సుదర్శన్ రెడ్డి జన్మ దినవేడుకలో మల్కాజిగిరి ఎం.పి ఈటల రాజేందర్



**మేడ్చల్ :** రక్తదానం అనేది మహాదానం. మనం ఇచ్చే ఒక యూనిట్ రక్తం ముగ్గురు ప్రాణాలను కాపాడు తుంది. సమాజంలో ప్రతి ఆరోగ్యవంతుడు స్వచ్ఛందంగా రక్తదానం చేయడం ద్వారా అత్యవసర పరిస్థితుల్లో రోగులకు అండగా నిలవాలి. జన్మదినాలు, శుభకార్యాలు వంటి సందర్భా ల్లో ఈ సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం అని మల్కాజిగిరి ఎం.పి ఈటెల రాజేందర్ అన్నారు. బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మేడ్చల్ నియోజకవర్గ బీజేపీ ఇంచార్జ్, మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి జన్మదిన వేడుకలు శనివారం ఆయన స్వగృహంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేందర్ విచ్చేసి, వారి చేతుల మీదుగా కార్మికులకు లేబర్ కార్డుల పంపిణీ చేశారు. రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈటెల కార్మికుల సంక్షేమం గురించి మాట్లాడుతూ, దేశ నిర్మాణంలో కార్మికుల పాత్ర ఎంతో గొప్పది. వారి కష్టంతోనే అభివృద్ధి సాధ్యమవుతోంది. లేబర్ కార్డులు కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, బీమా సౌకర్యాలు, విద్యా వైద్య ప్రయోజనాలు అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయన్నారు. ప్రతి అర్హత కలిగిన కార్మికుడు లేబర్ కార్డు పొందాలని, వారి హక్కులను కాపాడేందుకు భారతీయ జనతా పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు తిరుమల్ రెడ్డి జిల్లా అధ్యక్షులు బుద్ధి శ్రీనివాస్, మాజీ అధ్యక్షులు పట్లోళ్ల విక్రమ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి అమర మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ కార్యక్రమం విజయవంతానికి అంకితభావంతో పనిచేయాలి

**గుర్రం పవన్ కుమార్ గౌడ్**



**సికింద్రాబాద్ :** ఎస్ఐఆర్ (ఎస్ఐఆర్) కార్యక్రమం విజయవంతం కావాలంటే ప్రతి బూత్ ఏజెంట్ అంకితభావంతో పనిచేయాలని బీఆర్ఎస్ పార్టీ పద్మారావు నగర్ ఇంచార్జి గుర్రం పవన్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. శనివారం బెల్వర్డ్ గార్డెన్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ బూత్ ఏజెంట్లు, ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా పవన్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, ఈ నెల 8వ తేదీ సోమవారం నుంచి ప్రతిరోజూ ఒక్కో పోలింగ్ స్టేషన్ పరిధిలో ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. పద్మారావు నగర్ ప్రాంతంలో అధిక సంఖ్యలో అపార్ట్‌మెంట్లు ఉన్నందున, ఈ నెల 14వ తేదీ ఆదివారం అపార్ట్‌మెంట్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో బెల్వర్డ్ గార్డెన్‌లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా, ఈ నెల 21వ తేదీ ఆదివారం శివానంద ఆశ్రమం ప్రాంతంలో అవగాహన, మ్యాపింగ్ కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. పార్టీ శ్రేణులు, బూత్ ఏజెంట్లు ప్రజలతో సమన్వయం పెంచుకొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో డివిజన్ అధ్యక్షుడు వెంకటేష్ రాజు, ఏసూరి మహేష్, మిట్టపల్లి జగ్గయ్య, శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# గవర్నర్‌ను కలిసిన జెఎన్‌టియు వైస్ ఛాన్సలర్

- రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ భూమిని జెఎన్‌టియు కేటాయించాలి
- రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ భూమిని ఉచితంగా శాశ్వత బదిలీ

**కూకట్ పల్లి, జూన్ 6,(జనం వార్త ):** తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జేఎన్టీయూహెచ్ చాన్స్లర్ శివ్ ప్రతాప్ శుక్లను జేఎన్టీయూహెచ్ వైస్ ఛాన్స్ లర్ కిషన్ కుమార్ రెడ్డి శనివారం గవర్నర్ అధికారిక నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సెలర్ కిషన్ కుమార్ రెడ్డి జేఎన్టీయూ హెచ్ ఛాన్సెలర్ రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లకు 2024 నుండి 2026 సంవత్సరాల మధ్య కాలంలో విద్యారంగం ఆవిష్కరణలు, పారిశ్రామిక సహకారము, సంస్థాగత అభివృద్ధి, వివిధ రంగాలలో విశ్వవిద్యాలయం సాధించిందిన విజయాల గురించి వివరించారు. జాతీయ విద్యా విధానము 2020, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, విక్సిత్ భారత్ కార్యక్రమానికి అనుగుణంగా ఉన్న ప్రణాళిక ఆర్25 పాఠ్యప్రణాళిక అమలు గురించి ప్రస్తావించారు. స్వీడన్, జర్మనీ సంస్థలతో బలోపేతం చేయబడిన ప్రపంచ భాగస్వామ్యాల వివరాలను చాన్సులర్ కు అందజేశారు.రూ. 1 లక్ష రూపాయల పరిశోధన నిధుల వివరాలను ఆయన ఛాన్సలర్ కు తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సెమీ కండక్టర్లు,ప్రెసిషన్ అగ్రికల్చర్ వంటి అభివృద్ధి చెందుతున్న రంగాలలో పరిశోధనలను ప్రోత్సహించడానికి సిరి జేఎన్టీయూహెచ్ రెస్పాండ్ వంటి కార్యక్రమాల వివరాలు ఆయన ప్రత్యేకంగా తెలియజేశారు. విశ్వవిద్యాలయ విద్యార్థులు సాధించింది రూ. 50 లక్షల వార్షిక వేతన ప్యాకేజీలతో కూడిన విజయాలను,ఇంక్యూ బేషన్ కేంద్రాలలో విద్యార్థి పారిశ్రామికవేత్తలు అందించిన మద్దతు, మెరుగైన ఉపాధి అవకాశాల కోసం చేపట్టిన నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. విశ్వవిద్యాలయం ఎన్ఏఏసి అక్రిడేషన్ సాధించడంతోపాటు విద్యాపరమైన శ్రేష్టతను సాధించడానికి, విద్యార్థుల భవిష్యత్తుకు అవసరమైన విద్యను అందించడానికి, శ్రేష్టతను కొనసాగించాలనే విశ్వవిద్యాలయాన్ని నిబద్ధతను ఆయన చాన్సులర్ కు తెలియజేశారు. దీర్ఘకాలిక మౌలిక సదుపాయాల అభివృద్ధికి వీలుగా కూకట్ పల్లి లోని తెలంగాణ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ భూమిని ఉచితంగా శాశ్వత బదిలీ చేయాలని ఆయన కోరారు. విశ్వవిద్యాలయంలో 2012 సంవత్సరం నుంచి ఖాళీగా ఉన్న సుమారు 300 ఉపాధ్యాయ ఖాళీలను తక్షణమే భర్తీ చేయాల్సిన అవసరం ఉందని వివరించారు. ఈ కార్యక్రమంలో జేఎన్టీయూహెచ్ రిజిస్టర్ డా. కే. వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

# అనుమతిలేని అనాధ శరణాలయాలపై చర్యలు

**జిల్లా సమక్షేమాధికారి శారద**



**మేడ్చల్ :** బాలల న్యాయ చట్టం 2015 ప్రకారం జీరో నుండి పద్దెనిమిది సంవత్సరాల లోపు బాల బాలికలకు ఆశ్రయం కల్పిస్తున్నటువంటి ప్రతి అనాధ శరణాలయం, స్వచ్ఛంద సంస్థ తప్పనిసరిగా మహిళా శిశు సంక్షేమ శాఖ ద్వారా రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ పొంది ఉండాలని మేడ్చల్ జిల్లా సమక్షేమాధికారిని శారద అన్నారు. శనివారం ఆమె ఈ మేరకు పత్రికా ప్రకటన చేస్తూ, పిల్లలకు ఆశ్రమం కల్పిస్తూ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ పొందనటువంటి అనాధ శరణాలయం స్వచ్ఛంద సంస్థలపై బాలల న్యాయ చట్టం 2015 సెక్షన్ 42 ప్రకారంగా ఒక సంవత్సరం జైలు శిక్ష, లక్ష రూపాయల వరకు జరిమానా విధించడం జరుగుతుందన్నారు. మేడ్చల్ - మల్కాజ్గిరి జిల్లాలో ఏదైనా అనాధ శరణాలయం బాలలకు ఆశ్రయం కల్పిస్తూ ఇప్పటి వరకు రిజిస్ట్రేషన్ చేయించుకోనట్లయితే వెంటనే సంబంధిత మహిళా శిశు సంక్షేమ శాఖ వారిని సంప్రదించి రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ పొందవలసిందిగా జిల్లా సంక్షేమ అధికారిని శారద వెల్లడించారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో మహిళా శిశు సంక్షేమ శాఖ సిబ్బంది, పోలీస్ శాఖ వాళ్ళ సహాయంతో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో రిజిస్ట్రేషన్ అయిన అన్ని స్వచ్ఛంద సంస్థలను అనాధ ఆశ్రయాలను పరిశీలన చేయడం జరుగుతున్నది అదే సమయంలో అనుమతులు లేకుండా నడిపిస్తున్నటువంటి అనాధ ఆశ్రమాలను గుర్తిస్తూ వాటిపైన కూడా తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ విషయంపై మరిన్ని వివరాలు కొరకు బాల రక్ష భవన్ కో-ఆర్డినేటర్ లేదా జిల్లా బాలల రక్షణ సంరక్షణ అధికారిని ఫోన్ నెంబర్లు: 82478 14647, 8520043943. లకు సంప్రదించాలని ఆమె కోరారు.




# పర్యావరణం కాలుష్యంపై అవగాహన

**మేడ్చల్ :** ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక - 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా, ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల కలిగే పర్యావరణ కాలుష్యంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కూకట్‌పల్లి, సమతా నగర్ ప్రాంతంలో ప్లాస్టిక్ లిట్టర్‌పై తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో రిషి యూబీఆర్ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాల దుష్ప్రభావాలు, పర్యావరణ పరిరక్షణ అవసరం, పరిశుభ్రమైన పరిసరాల నిర్వహణ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాల్సిన అవసరంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ర్యాలీలో కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థినులు తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి మేడ్చల్ ప్రాంతీయ కార్యాలయం ఇంజినీర్ బి.రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# జులై మధ్య కల్లా భారత్-అమెరికా తొలి దశ ఒప్పందం

**విశాఖపట్నం:** మధ్యంతర వాణిజ్య ఒప్పందం పూర్తి దిశగా భారత్, అమెరికా కదులుతున్నాయని, జులై మధ్య కల్లా తొలి దశ ఒప్పందం కుదుర్చుకునే అవకాశం ఉందని వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూశ్ గోయల్ పేర్కొన్నారు. ఒప్పందాన్ని ఖరారు చేయడానికి అమెరికా బృందం దిల్లీలో ఈనెల 4 వరకు చర్చలు జరిపినట్లు మంత్రి గుర్తు చేశారు. 'వారిని నేను కూడా కలిశాను. పెండింగ్‌లో ఉన్న అన్ని అంశాలనూ పరిష్కరించుకుంటూ ముందుకెళుతున్నాం. కాబట్టి వచ్చే నెల మధ్య ప్రాంతంలో తొలి దశ ఒప్పందానికి అవకాశం ఉంది. ఒప్పందం అనంతరం ఇతర పోటీదార్లతో పోలిస్తే, అమెరికా నుంచి భారత్‌కు ప్రాధాన్యత లభిస్తుంద'ని వివరించారు.





## బిజినెస్




## దరఖాస్తుదారులకు డిజిటల్ రుణాలపై ఆసక్తి ఎందుకు?

గతంలో రుణాలు ఆశించేవారు బ్యాంకుల చుట్టూ అనేక సార్లు తిరగాల్సి వచ్చేది. కొద్ది మొత్తంలో వ్యక్తిగత రుణం అవసరమైనా కూడా బ్యాంకుల చుట్టూ ప్రదక్షణలు తప్పేవి కావు. అయితే, ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. స్మార్ట్‌ఫోన్లు రోజువారీ జీవితంలో ప్రధాన భాగంగా మారడం, డిజిటల్ సేవలు సర్వసాధారణం కావడంతో..రుణాలు కూడా ఆన్‌లైన్ అయిపోయాయి. వేగవంతమైన, మరింత పారదర్శకమైన వ్యక్తిగత రుణాల కోసం భారతీయులు డిజిటల్ ప్లాట్‌ఫాంల వైపు మొగ్గు చూపుతున్నారు. ఉద్యోగులే కాకుండా స్వయం ఉపాధి పొందే వ్యక్తులు కూడా సంప్రదాయ మార్గాల కంటే ఆన్‌లైన్‌లోనే వ్యక్తిగత రుణాలు తీసుకోవడానికి ఆసక్తి చూపుతున్నారు. వీటి మధ్య కొన్ని ప్రాథమిక వ్యత్యాసాలు తెలుసుకుంటే, డిజిటల్ రుణాలవైపు దరఖాస్తుదారులు ఎందుకు మొగ్గుచూపుతున్నారో అర్థమవుతుంది. అవేంటో ఇక్కడ చూద్దాం.

### డిజిటల్ లోన్

డిజిటల్ పర్సనల్ లోన్ అంటే పేరుకు తగ్గట్టే, పూర్తిగా ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోగలిగే రుణం. ప్రాసెస్, ఆమోదం కూడా ఆన్‌లైన్‌లోనే జరుగుతుంది. అర్హత తనిఖీల నుంచి పత్రాల సమర్పణ, ఈఎంఐ చెల్లింపులను ట్రాక్ చేయడం వరకు, ఈ మొత్తం ప్రయాణం సాధారణంగా ఒక యాప్ లేదా వెబ్‌సైట్ ద్వారా డిజిటల్‌గా ఉంటుంది. డిజిటల్ లోన్లను ప్రత్యేకంగా ఆకర్షణీయంగా మార్చేది వాటి వేగం, సరళత అని చెప్పొచ్చు. రుణ సంస్థలు..భౌతిక కాగితపు పనులకు బదులుగా, డిజిటల్‌గా అర్హతను అంచనా వేయడానికి ఆన్‌లైన్ ఖేజ, ఆధార్ ఆధారిత ధ్రువీకరణ, ఆటోమేటెడ్ తనిఖీలను ఉపయోగిస్తాయి. రుణాన్ని ఆశించేవారు రుణ ఆఫర్లను దాదాపు తక్షణమే చూడవచ్చు. వడ్డీ రేట్లు, జువీ×లను వేరే రుణ సంస్థలతో పోల్చుకోవచ్చు. నిబంధనలు సౌకర్యవంతంగా ఉన్నాయో, లేవో వెంటనే తెలుసుకోవచ్చు.

### సంప్రదాయ రుణాలు

సంప్రదాయ పర్సనల్ లోన్లను బ్యాంకులు/ఎన్‌బీఎఫ్‌సీలు తమ భౌతిక శాఖల ద్వారా అందిస్తాయి. ఈ రుణాలు ఇప్పటికీ విస్తృతంగా అందుబాటులో ఉన్నప్పటికీ, వాటి ప్రక్రియ ఎక్కువ సమయం తీసుకుంటుంది. సుదీర్ఘ డాక్యుమెంట్ల ప్రక్రియ ఉంటుంది. దరఖాస్తుదారులు..ప్రింటెడ్ ఫారంలు, ఆదాయ రుజువులు, బ్యాంక్ స్టేట్‌మెంట్లు, గుర్తింపు, చిరునామా పత్రాలతో పాటు, కొన్నిసార్లు పనిజేసే సంస్థ ధ్రువీకరణ లేఖలను కూడా సమర్పించాల్సి ఉంటుంది. ఆమోద ప్రక్రియ..మాన్యువల్ ధ్రువీకరణ, అంతర్గత తనిఖీలు, బ్రాంచ్ సమన్వయంపై ఆధారపడి ఉంటాయి. దీనివల్ల ఆలస్యం జరగవచ్చు. అంతేకాకుండా, దరఖాస్తు చివరి దశల వరకు దరఖాస్తుదారులకు..వడ్డీ రేట్లు, ప్రాసెసింగ్ ఫీజులు లేదా చెల్లింపుల సౌలభ్యం గురించి పూర్తి అవగాహన ఉండకపోవచ్చు. సంప్రదాయ రుణాలు నమ్మదగినవి అయినప్పటికీ, రుణ లభ్యత ఆలస్యం కావడం చేత నేటి డిజిటల్ యుగంలో అవి అంత ఆకర్షణీయంగా లేవని చెప్పొచ్చు.




## శ్రేయస్ అయ్యర్‌కే కెప్టెన్సీ..

### వైభవ్ సూర్యవంశీకి ఛాన్స్

టీమ్‌ఇండియా టీ20 జట్టుకు కొత్త సారథి వచ్చాడు. సూర్యకుమార్ స్థానంలో శ్రేయస్ అయ్యర్‌కు కెప్టెన్సీ అప్పగించింది. బీసీసీఐ సెలక్షన్ కమిటీ భేటీ అనంతరం తన సోషల్ మీడియా ఖాతాలో స్క్వాడ్‌లను పోస్టు చేసింది. తెలుగు కుర్రాడు తిలక్ వర్మను వైస్ కెప్టెన్‌గా నియమిస్తూ సెలక్షన్ కమిటీ నిర్ణయం తీసుకుంది. ప్రిన్స్ యాదవ్, వైభవ్ సూర్యవంశీకి అవకాశం దక్కింది. సూర్యకుమార్ యాదవ్‌ను స్క్వాడ్‌లోకి ఎంపిక చేయకపోవడం గమనార్హం. ఆసియా గేమ్స్ కోసం బుమ్రా జట్టులోకి రాగా.. సిరాజ్, ప్రిన్స్‌కు విశ్రాంతి ఇచ్చారు.

**ఇంగ్లాండ్, ఐర్లాండ్‌తో సిరీస్‌లకు జట్టు :** శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), తిలక్ వర్మ (వైస్ కెప్టెన్), అభిషేక్ శర్మ, నితీశ్ కుమార్‌రెడ్డి, సంజు శాంసన్ (వికెట్ కీపర్), ఇషాన్ కిషన్, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, శివమ్ దూబే, వరుణ్ చక్రవర్తి, వైభవ్ సూర్యవంశీ, రవి బిష్ణోయ్, మహ్మద్ సిరాజ్, హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ సింగ్, ప్రిన్స్ యాదవ్

**ఐర్లాండ్‌తో ఎప్పుడంటే?**

జూన్ 26న తొలి టీ20 మ్యాచ్
జూన్ 28న రెండో టీ20 మ్యాచ్

**ఇంగ్లాండ్‌తో ఎప్పుడంటే?**

జులై 1న తొలి టీ20
జులై 4న రెండో టీ20
జులై 7న మూడో టీ20
జులై 9న నాలుగో టీ20
జులై 11న ఐదో టీ20

**ఆసియా గేమ్స్‌కు స్క్వాడ్ :** శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), తిలక్ వర్మ (వైస్ కెప్టెన్), రవి బిష్ణోయ్, అభిషేక్ శర్మ, నితీశ్ కుమార్ రెడ్డి, జస్‌ప్రీత్ బుమ్రా, సంజు శాంసన్, అక్షర్ పటేల్, హర్షిత్ రాణా, ఇషాన్ కిషన్, వాషింగ్టన్ సుందర్, అర్ష్‌దీప్ సింగ్, శివమ్ దూబె, వరుణ్ చక్రవర్తి, వైభవ్ సూర్యవంశీ.

## సచిన్ రికార్డు బ్రేక్ చేసిన వైభవ్



ఐపీఎల్ 2026లో రికార్డుల మోత మోగించిన 15 ఏళ్ల యువ సంచలనం వైభవ్ సూర్యవంశీకి జాతీయ జట్టు నుంచి తొలిసారి పిలుపు వచ్చింది. ఐర్లాండ్, ఇంగ్లాండ్ టీ20 సిరీస్‌ల కోసం ప్రకటించిన భారత జట్టులో అతడికి చోటు దక్కింది. 15 ఏళ్ల 70 రోజుల వయసులోనే ఎంపికై సచిన్ టెండూల్కర్ రికార్డును వైభవ్ బ్రేక్ చేశాడు. ఐపీఎల్‌లో 776 పరుగులు, 72 సిక్సర్లతో ఆరెంజ్ క్యాప్, మోస్ట్ వాల్యుబుల్ ప్లేయర్ అవార్డులను గెలుచుకుని, సెలక్టర్లు కచ్చితంగా ఎంపిక చేయాల్సిన పరిస్థితిని అతడు కల్పించాడు. 15 ఏళ్ల వయసులోనే ఐపీఎల్‌లో రికార్డుల బూజు దులిపిన వైభవ్ సూర్యవంశీకి జాతీయ జట్టు నుంచి పిలుపు అందింది. ఐర్లాండ్, ఇంగ్లాండ్‌తో త్వరలో జరగనున్న టీ20 సిరీస్ కోసం భారత సెలక్షన్ కమిటీ శనివారం జట్లను ప్రకటించింది. ఇందులో వైభవ్ సూర్యవంశీకి చోటు దక్కింది. తన ప్రదర్శనతో జట్టులో ఎంపిక చేయక తప్పని పరిస్థితిని వైభవ్ కలిగించాడని చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ వెల్లడించాడు. అయితే భారత జట్టు నుంచి తొలిసారి పిలుపు అందుకోవడం ద్వారా.. వైభవ్ సూర్యవంశీ రికార్డు క్రియేట్ చేశాడు. 15 ఏళ్ల 70 రోజుల వయసులో వైభవ్‌కు టీమిండియా నుంచి పిలుపు అందింది. గతంలో ఈ రికార్డు టీమిండియా క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ పేరిట ఉంది. మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్.. భారత్ తరపున 16 ఏళ్ల 205 రోజులు ఉన్నప్పుడు ఎంపికయ్యాడు. తాజాగా ఆ రికార్డును వైభవ్ సూర్యవంశీ బ్రేక్ చేశాడు. ప్రపంచ దృష్టిని తనవైపు ఆకర్షించాడు. కాగా ఇటీవల ముగిసిన ఐపీఎల్ 2026లో వైభవ్ సూర్యవంశీ పలు భారీ రికార్డులు బ్రేక్ చేశాడు. తన పవర్ బ్యాటింగ్‌తో సత్తాచాటిన అతడు.. భారీ సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. ఈ సీజన్‌లో అతడు ఏకంగా 72 సిక్సర్లు బాదాడు. దీంతో ఓ ఐపీఎల్ సీజన్‌లో అత్యధిక సిక్సర్లు కొట్టిన గేల్ రికార్డును బ్రేక్ చేశాడు. యూనివర్సల్ బాస్ క్రిస్ గేల్.. 2012 సీజన్‌లో 65 సిక్సర్లు బాదడం గమనార్హం. మరోవైపు ఇండియన్ ప్రీమియర్ లీగ్ 19వ ఎడిషన్‌లో ఈ 15 ఏళ్ల చిచ్చర పిడుగు 16 మ్యాచులలో ఆడాడు. అందులో ఏకంగా సుమారు 240 స్ట్రైక్ రేటుతో 776 పరుగులు స్కోరు చేశాడు. దీంతో ఆరెంజ్ క్యాప్ సొంతం చేసుకున్నాడు. అంతేకాకుండా 436.5 పాయింట్స్‌తో మోస్ట్ వాల్యుబుల్ ప్లేయర్ ఆఫ్ ది సీజన్ అవార్డు సొంతం చేసుకున్నాడు. 72 సిక్సర్లతో సూపర్ సిక్సెస్ ఆఫ్ ది సీజన్‌గా నిలిచాడు. 237.31 స్ట్రయిక్ రేట్‌తో సూపర్ స్ట్రయికర్ ఆఫ్ ది సీజన్‌గా నిలిచాడు. ఎమర్జింగ్ ప్లేయర్ ఆఫ్ ది సీజన్ అవార్డు కూడా వైభవ్ సూర్యవంశీకే దక్కడం గమనార్హం.

## భారత్ స్కోరు 368/3

### కేఎల్ రాహుల్ - శుభ్‌మన్ గిల్ సెంచరీలు..





అఫ్ఘానిస్థాన్‌తో జరుగుతోన్న ఏకైక టెస్టు మ్యాచ్‌లో భారత్ బ్యాటర్లు అదరగొట్టారు. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న టీమ్‌ఇండియా తొలి రోజు ఆట ముగిసేసరికి.. మూడు వికెట్ల నష్టానికి 368 పరుగులు చేసింది. క్రీజ్‌లో శుభ్‌మన్ గిల్ (103), రిషభ్ పంత్ (50) ఉన్నారు. వీరిద్దరూ ఇప్పటికే నాలుగో వికెట్‌కు 121 పరుగులు జోడించారు. అఫ్గాన్ బౌలర్లలో సలీమ్ సాఫి 2, రహ్మాన్ షరిఫి ఒక వికెట్ పడగొట్టారు.

**పరుగుల వరద..**

మొన్నటి వరకూ టీ20 క్రికెట్ మూడ్‌లో ఉన్న భారత ప్లేయర్లు ఎలా ఆడతారని అభిమానులు కాస్త సంశయించారు. అయితే, ఓపెనర్లు కేఎల్ రాహుల్ (100: 165 బంతుల్లో 11 ఫోర్లు), యశస్వి జైస్వాల్ (24) టెస్టు ఫార్మాట్‌కు మారిపోయారు. ఆరంభంలో ఆచితూచి ఆడి పరుగులు రాబట్టారు. కాస్త దూకుడుగా ఆడే క్రమంలో యశస్వి పెవిలియన్‌కు చేరాడు. అయితే, వన్‌డౌన్‌లో వచ్చిన సాయి సుదర్శన్ (81)తో కలిసి కేఎల్ ఇన్నింగ్స్‌ను నడిపించాడు. వీరిద్దరూ కలిసి రెండో వికెట్‌కు 139 పరుగులు జోడించారు. సెంచరీకి కాస్త దూరంలో సాయి.. శతకం చేసిన వెంటనే కేఎల్ ఔటయ్యారు. అయితే, కెప్టెన్ శుభ్‌మన్ గిల్ అద్భుతమైన స్ట్రోక్ ప్లేతో ఆకట్టుకున్నాడు. మరో ఎండ్‌లో రిషభ్ పంత్ అప్పుడప్పుడు హిట్టింగ్ చేయడంతో పరుగుల వరద పారింది. ఈ క్రమంలో గిల్ తన కెరీర్‌లో 11వ శతకం పూర్తి చేసుకోగా.. రిషభ్ పంత్ 19 అర్ధశతకం ఖాతాలో వేసుకున్నాడు. మరో వికెట్ ఇవ్వకుండా తొలి రోజు ఆటను వీరిద్దరే ముగించారు.

## సూర్యకుమార్‌ను తప్పించడానికి కారణం ఫామ్‌లో లేకపోవడం వల్లే

### అజిత్ అగార్కర్



జూన్ ఆఖర్లో ఐర్లాండ్‌తో, జులై ఆరంభంలో ఇంగ్లాండ్‌తో భారత్ టీ20లు ఆడనుంది. సెప్టెంబర్‌లో ఆసియా గేమ్స్‌లో టీమ్‌ఇండియా పాల్గొననుంది. ఈ సిరీస్‌ల కోసం సెలక్టర్లు శనివారం భారత జట్టును ప్రకటించారు. అనుకున్నట్లుగానే సూర్యకుమార్‌పై వేటు వేసి ఆ బాధ్యతలను శ్రేయస్ అయ్యర్‌కు అప్పగించారు. సూర్యకు ఆటగాడిగా కూడా అవకాశం దక్కలేదు. జట్ల వివరాలు ప్రకటించిన తర్వాత చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ విలేకరులతో మాట్లాడాడు. ఫామ్‌లో లేకపోవడం వల్లే సూర్యకుమార్‌ను తప్పించినట్లు తెలిపాడు. దీని గురించి సూర్యకుమార్‌తో మాట్లాడానని, ఆ వివరాలను బయటపెట్టకూడదని పేర్కొన్నాడు.

**సూర్యను ఎందుకు తప్పించామంటే..?**

"గత రెండేళ్లలో ప్రదర్శన ముఖ్యమే అనడంలో సందేహం లేదు. కానీ, మేం అద్భుతంగా రాణిస్తూ ఎన్నో మ్యాచ్‌లు గెలిచాం. ప్రపంచ కప్ సాధించినప్పుడు కూడా సూర్యనే కెప్టెన్‌గా ఉన్నాడు. ఈ నిర్ణయం తీసుకోవడంలో కేవలం ఐపీఎల్ ప్రదర్శన మాత్రమే కీలకమైందని నేను అనుకోను"

**శ్రేయస్ అయ్యర్‌కు కెప్టెన్సీపై..**

'భవిష్యత్తును దృష్టిలో ఉంచుకోవడం గురించి ఎప్పుడూ చర్చలు జరుగుతూనే ఉన్నాయి. శ్రేయస్ అయ్యర్ బ్యాటింగ్‌లో అద్భుతంగా రాణిస్తున్నాడు. గత కొన్నేళ్లుగా వివిధ ఫ్రాంచైజీలకు నాయకత్వం వహిస్తూ అతను ఏమి చేశాడో మనం చూశాం. దీంతో అతడిని కెప్టెన్‌గా ఎంపిక చేశాం"

**తిలక్ వర్మకు అందుకే ఇచ్చాం..**

"జట్టులో తిలక్ వర్మ స్థానం పట్ల మాకు ఎలాంటి సందేహాలు లేవు. ప్రపంచ కప్‌లో అతను కొన్ని కీలకమైన ఇన్నింగ్స్‌లు ఆడాడు. వైస్ కెప్టెన్‌గా ఉండటం వల్ల అతనికి ఆ బాధ్యత గురించి కొంత నేర్చుకునే అవకాశం లభిస్తుంది. ఒక ఆటగాడిగా అతని సామర్థ్యంపై ఎలాంటి సందేహాలూ లేవు. నిజానికి, ఒక ఆటగాడి విషయంలో అందరూ ముందుగా చూసేది అదే"

**కోహ్లీ ఫిట్‌నెస్‌పై**

"కోహ్లీ గాయపడి వారం రోజులు కూడా కాలేదు. కోలుకోవడానికి ఎంత సమయం పడుతుందో ఇంకా తెలియదు. కానీ ఇంగ్లాండ్‌తో జరిగే వన్డే సిరీస్ సమయానికి అతను ఫిట్‌గా ఉంటాడన్న సూచనలు కనిపిస్తున్నాయి. ఫిజియో నుంచి కూడా ఇంకా ఎటువంటి స్పష్టమైన టైమ్‌లైన్ రాలేదు"

**హార్దిక్‌ను టీ20లకు ఎందుకు తీసుకోలేదు?**

'అఫ్గానిస్థాన్‌తో వన్డే సిరీస్ జట్టులో హార్దిక్ పాండ్య భాగంగా ఉన్నాడు. అతడిని వన్డే మ్యాచ్‌లే ఆడించాలనుకుంటున్నాం. ఇది నితీష్ రెడ్డికి అవకాశం కల్పిస్తుంది. ఆటగాళ్ల రొటేషన్, విశ్రాంతి వంటివి ఉంటాయి. హార్దిక్ వన్డే ప్రపంచ కప్‌కు సిద్ధంగా ఉంటాడా లేదా అనేది పరిశీలిస్తాం. పరిస్థితిని అంచనా వేసి తదుపరి నిర్ణయం తీసుకుంటాం"

**రజత్ పాటీదార్ గురించి చర్చ జరిగిందా?**

"చాలా మంది ఆటగాళ్ల గురించి చర్చించాం. అందులో పాటీదార్ పేరు కూడా ఉంది. భారత్‌లో చాలా మంది మంచి ఆటగాళ్లు ఉన్నారు. జట్టులో నేరుగా చోటు దక్కించుకునే స్థాయి ఉన్నవారు ఎంతోమంది ఉన్నప్పటికీ ప్రస్తుతం ఆడుతున్న వారు రాణిస్తున్నారు. ఎంపిక ప్రక్రియలో కొందరు ఆటగాళ్లకు అవకాశం దక్కకపోవడం సహజం. మేం మంచి జట్లను ఎంపిక చేశామని భావిస్తున్నాం" అని అగార్కర్ వివరించాడు.



## రోహిత్ మళ్లీ అద్భుతాలు సృష్టిస్తాడు

### కోచ్ దినేష్ లాడ్ గట్టి కౌంటర్

ఇండియా మాజీ కెప్టెన్, స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ ఫామ్, ఫిట్‌నెస్ పై వస్తున్న విమర్శలకు అతడి చిన్ననాటి కోచ్ దినేష్ లాడ్ గట్టి కౌంటర్ ఇచ్చాడు. శుక్రవారం ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో దినేష్ లాడ్ మాట్లాడుతూ, రోహిత్ ఎవరికీ ఏమీ నిరూపించుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేశాడు. ఇండియాకు వన్డే వరల్డ్ కప్ గెలిపించాలనే పట్టుదల రోహిత్ ను ఇంకా మోటివేట్ చేస్తోందని అన్నాడు. వన్డే క్రికెట్ లో మూడు డబుల్ సెంచరీలు చేసిన ఏకైక ప్లేయర్ రోహిత్ అని, 2019 వరల్డ్ కప్ లో ఐదు సెంచరీలు చేసిన రికార్డు అతడికి ఉందని గుర్తు చేశాడు. టెస్టులు, టీ20లకు రిటైర్మెంట్ ప్రకటించిన రోహిత్, వన్డేల్లో మాత్రం ఇండియాను ఫైనల్స్ కు చేర్చడానికి తన ఎక్స్ పీరియన్స్ తో హెల్ప్ అవుతాడని చెప్పాడు. రోహిత్ శర్మ రాబోయే ఆరు నెలల్లో తన ఫిట్‌నెస్, బ్యాటింగ్ ఫామ్ ను నిరూపించుకుంటేనే 2027 వన్డే వరల్డ్ కప్ సెలెక్షన్ ప్లాన్స్ లో ఉంటాడని మాజీ సెలెక్టర్ సబా కరీం చేసిన కామెంట్స్ పై దినేష్ లాడ్ మండిపడ్డాడు. ఆరు నెలల టైమ్ అనేది ఒక్క రోహిత్ కే కాదు, టీమ్ లోని ప్రతి ప్లేయర్ కు ఇంపార్టెంట్ అని అన్నాడు. రోహిత్ 2027 వరల్డ్ కప్ కచ్చితంగా ఆడతాడని తనకు 100 పర్సెంట్ గ్యారెంటీ ఉందని స్పష్టం చేశాడు. రోహిత్ ఖాళీగా ఉంటూ లైఫ్ ఎంజాయ్ చేయడం లేదని, ప్రతిరోజూ ప్రాక్టీస్ చేస్తూ తన ఫిట్‌నెస్ పై వర్క్ చేస్తున్నాడని తెలిపాడు. న్యూజిలాండ్ తో జరిగిన వన్డే సిరీస్ లో మూడు ఇన్నింగ్స్ లో 61 రన్స్ మాత్రమే చేయడంతో రోహిత్ పై విమర్శలు పెరిగాయి. అయితే రోహిత్ టెక్నిక్ పరంగా ఎలాంటి ప్రాబ్లం లేదని లాడ్ అన్నాడు. వన్డే క్రికెట్ లో కాసేపు క్రీజులో సెటిల్ అవ్వడం ముఖ్యమని, రోహిత్ కు ఆ టెక్నిక్ బాగా తెలుసని చెప్పాడు. రీసెంట్ ఐపీఎల్ లో కూడా కేవలం బిగ్ షాట్స్ మాత్రమే కాకుండా సింగిల్స్, డబుల్స్ తీస్తూ రోహిత్ తన క్లాస్ టెక్నిక్ ను చూపించాడని గుర్తు చేశాడు. విమర్శకులు ఏదేదో మాట్లాడుతుంటారని, వాటిని పట్టించుకోవాల్సిన అవసరం లేదని అన్నాడు. రోహిత్ శర్మకు తన కెరీర్ లోని ఈ కీలక ఫేజ్ లో లాడ్ ఒక ముఖ్యమైన అడ్వైజ్ ఇచ్చాడు. క్రీజులో కాసేపు నిలబడి సెటిల్ అయితే రోహిత్ ఎంత డేంజరస్ ప్లేయరో అందరికీ తెలుసని అన్నాడు. 2019 వరల్డ్ కప్ లో ఎలా ఆడాడో రోహిత్ మరోసారి గుర్తు తెచ్చుకొని అలాగే ఆడాలని కోరాడు. నిద్రలో నుంచి లేచినా రోహిత్ బెస్ట్ పర్ఫార్మెన్స్ ఇస్తాడని, వరల్డ్ కప్ కంటే ముందే ఇండియాలో జరిగే డొమెస్టిక్ 50 ఓవర్ల మ్యాచ్ లలో ఆడితే మరింత టచ్ లోకి వస్తాడని సజెస్ట్ చేశాడు. ఇండియా కోసం వరల్డ్ కప్ గెలవడమే రోహిత్ మెయిన్ టార్గెట్ అని, అది సాధించాకే రిటైర్ అవుతాడని కోచ్ స్పష్టం చేశాడు.

